క్లీన్ మచిలీపట్నం

- నగరంలో పేరుకుపోయిన చెత్తకు మోక్షం
- ఏ రోజు చెత్త ఆ రోజే ఎనర్జీ ప్లాంట్‌కు తరలిస్తున్న వైనం
- డంపింగ్ యార్డు ప్రక్షాళన ప్రారంభం
- ఆ స్థానంలో పార్కు నిర్మాణానికి ప్రతిపాదన


చెత్తను యంత్రం సాయంతో ప్రాసెసింగ్ చేస్తున్న సిబ్బంది

మచిలీపట్నంటౌన్: నగరంలో చెత్త సమస్యకు అధికారులు శాశ్వత పరిష్కారం చూపారు. ప్రభుత్వాదేశాలతో నగరంలో చెత్తగుట్టలు ఇకపై కనపడకుండా ఉండేలా చర్యలకు ఉపక్రమించారు. సంవత్సరాలుగా డంపింగ్‌యార్డులో పేరుకుపోయిన చెత్తను ఇక్కడి నుంచి తొలగించే పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. ఈ పనులు రానున్న ఆరు నెలల్లో పూర్తి చేసి.. ఇదే స్థానంలో నగరవాసుల కోసం పార్కును ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

55 వేల టన్నుల చెత్త తొలగింపు..

నగరంలోని ఆంధ్ర జాతీయ కళాశాల సమీపంలో డంపింగ్ యార్డులో సంవత్సరాలుగా చెత్త పేరుకుపోయి ఉంది. ఈ చెత్తను క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా పూర్తిగా తొలగించేందుకు చర్యలు చేపట్టారు. తరుణి అసోసియేట్ సంస్థ డంపింగ్‌యార్డులో పేరుకుపోయిన చెత్తను ప్రాసెసింగ్ చేసే పనులను ప్రారంభించింది. ఈ ప్రాసెసింగ్ యంత్రం చెత్తలోని మట్టి, ప్లాస్టిక్, గాజుపెంకులు, రాళ్లు ఇతర వ్యర్థాలు వేరు చేస్తుంది. ఈ ప్రాసెసింగ్ నిర్వహించినందుకు గానూ టన్నుకు రూ. 720లను నగర పాలక సంస్థ ఆ సంస్థకు చెల్లిస్తోంది. దాదాపు 55 నుంచి 60 వేల టన్నుల మేర ఈ చెత్త ఉండవచ్చని అంచనా వేశారు. రానున్న మూడు నుంచి ఆరు నెలల్లో చెత్త నిర్మూలన కార్యక్రమం పూర్తికానుంది. వ్యర్థాల నుంచి వచ్చిన మట్టిని నగరంలోని పల్లపు ప్రాంతాల్లో మెరక చేసేందుకు వినియోగిస్తున్నారు. ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను ఎనర్జీ ప్లాంట్లకు తరలిస్తున్నారు. సేకరిస్తున్న వ్యర్థాలను లారీల్లో లోడ్ చేసి ఇక్కడ ఏర్పాటు చేసిన వే బ్రిడ్జి వద్ద కాటా వేసి తరలిస్తున్నారు.


వే బ్రిడ్జి వద్ద వ్యర్థాలను కాటా వేసి తీసుకువెళ్తున్న టిప్పర్

రోజువారీ చెత్త ఎనర్జీ ప్లాంట్‌కు..

పేరుకుపోయిన చెత్తను ప్రాసెసింగ్ చేస్తుండగా ప్రస్తుతం రోజువారీ వస్తున్న చెత్తను డంపింగ్‌యార్డులో వేయకుండా నగరపాలక సంస్థకు ఉన్న నాలుగు డంపర్ వాహనాల ద్వారా ఎనర్జీ ప్లాంట్‌కు తరలిస్తున్నారు. నగరంలోని అన్ని డివిజన్లలో చెత్తను సేకరిస్తున్న ట్రక్కు ఆటోల ద్వారా తెచ్చిన చెత్తను లారీల్లో నింపి ఎనర్జీ ప్లాంట్‌కు పంపుతున్నారు. ప్రతిరోజు దాదాపు 25 టన్నులకు పైగా చెత్తను తరలిస్తున్నారు. ఫలితంగా నగరంలో సేకరించిన చెత్త కనపడని పరిస్థితి నెలకొంది.

డంపింగ్‌యార్డు స్థలంలో పార్కు ఏర్పాటు..



డంపింగ్‌యార్డులో పేరుకుపోయిన చెత్త తొలగింపు అనంతరం స్థలం ఖాళీ అవుతోంది. ఈ స్థలంలో క్లీన్ ఆంధ్రప్రదేశ్ నిబంధనల ప్రకారం పార్కును ఏర్పాటు చేయనున్నాం. ఈ పార్కు ఏర్పాటుతో ఆ ప్రాంత ప్రజలు ఆహ్లాదంగా గడిపేందుకు వీలు కలుగుతుంది. నగరంలో చెత్త సమస్య పూర్తిగా తొలగిపోతుంది.

– డాక్టర్ వై. బాలసుబ్రహ్మణ్యం, మునిసిపల్ హెల్త్ ఆఫీసర్

క్లుప్తంగా

బందరు సబ్ డివిజన్‌లో పోలీస్‌యాక్టు అమలు

కోనేరుసెంటర్: బందరు సబ్–డివిజన్ పరిధిలో మార్చి 20వ తేదీ నుంచి ఏప్రిల్ 18వ తేదీ వరకు సెక్షన్ 30 పోలీస్‌యాక్టు అమలుపరుస్తున్నట్లు బందరు డీఎస్పీ మాసూంబాషా తెలిపారు. యాక్టు అమలులో ఉండగా పోలీసుల అనుమతి లేకుండా ఏ ఒక్కరూ సభలు, సమావేశాలు, ఇతరత్రా కార్యక్రమాలు నిర్వహించకూడదన్నారు. బహిరంగ ప్రదర్శనలు, ర్యాలీలు వంటివి కూడా నిర్వహించకూడదన్నారు. అలాంటి కార్యక్రమాలు నిర్వహించదలచుకున్న వ్యక్తులు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉపాధి నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం



కోసూరువారిపాలెం(మోపిదేవి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో మండల పరిధిలోని కోసూరువారిపాలెం బీసీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మిస్తున్నారు. గొల్లపాలెంలో ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి గొరిపర్తి రామయ్య ఇంటివరకు 97 మీటర్ల పొడవున రూ. 5.30 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు పంచాయతీరాజ్ ఏఈ బొప్పన శ్రీనివాస్ తెలిపారు. గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి సహకరిస్తున్న స్థానిక ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుకు మండల సచివాలయ కన్వీనర్ కోసూరు శివనాగమల్లేశ్వరావు కృతజ్ఞతలు తెలిపారు.

లక్ష్మణస్వామి మృతి తీరనిలోటు



గూడూరు: గురిజేపల్లి సర్పంచి అద్దంకి లక్ష్మణస్వామి(చంటి) మృతి తీరని లోటని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన లక్ష్మణస్వామి పార్థివ దేహానికి మచిలీపట్నం హౌసింగ్‌బోర్డు కాలనీలోని ఆయన స్వగృహంలో మంత్రి జోగి రమేష్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గురిజేపల్లి గ్రామంలో వర్గ రాజకీయాలకు అతీతంగా అందరినీ ఏకతాటిపై నడిపిస్తూ గత 35ఏళ్లుగా పంచాయతీలో ఎన్నికలలు లేకుండా ఏకగ్రీవం చేయడంలో లక్ష్మణస్వామి ప్రధాన భూమిక పోషించారన్నారు. వ్యక్తిగతంగా అందరినీ కలుపుకుంటూ పోతూ వివాదరహితుడిగా, సౌమ్యుడిగా గుర్తింపు పొందిన లక్ష్మణస్వామి మృతి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటన్నారు. లక్ష్మణస్వామి కుటుంబసభ్యులను ఆయన ఓదార్చారు. కార్యక్రమంలో ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, వైస్ ఎంపీపీ నేతల కుటుంబరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వర్షాలకు దెబ్బతిన్న మినుము పంట పరిశీలన



గూడూరు: ఇటీవల కురిసిన అకాల వర్షాలకు గూడూరు మండలంలో దెబ్బతిన్న మినుము పంటను వ్యవసాయ శాఖ బందరు ఏడీఏ కె.శ్రీనివాస్, గూడూరు ఏఓ కె.హెప్సిబా రాణి సోమవారం పరిశీలించారు. మండలంలోని కంచాకోడూరు, మద్దిపట్ల, గూడూరు పరిసర ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించిన అధికారులు వర్షాలకు తడిసిన పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు పంట చేతికొచ్చే సమయంలో కురిసిన వర్షాలకు పంట బాగా దెబ్బతిందన్నారు. వర్షాలతో రైతులకు అపార నష్టం వాటిల్లిందని, రైతులు ఎదుర్కొంటున్న సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆదుకోవాలని వారు కోరారు. దీనిపై స్పందించిన అధికారులు రైతాంగం సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే మార్గదర్శకాల ప్రకారం రైతులను ఆదుకునేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తామని భరోసా ఇచ్చారు.

2,056 హెక్టార్లలో దెబ్బతిన్న మినుము

పెడన: మండలంలో ఇటీవల కురిసిన వానలకు మినుము పంట 2,056 హెక్టార్లలో దెబ్బతిందని వ్యవసాయశాఖాధికారులు ప్రాథమిక అంచనాలు రూపొందించారు. మినుము పంట దశలో 284 హెక్టార్లు ఉంటే 655 హెక్టార్లు మినుము తీత తీసి పొలాల్లో ఉందని, 1,117 హెక్టార్లు కుప్పలుగా వేసి ఉంచారని పెడన ఏవో జీవీ శ్రీనివాసరావు తెలిపారు. ఈమేరకు నివేదికలు సిద్ధం చేశామన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలు రాగానే పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించి పంట నష్టంపై తుది నివేదిక అందజేస్తామన్నారు.

పేదల ఇంట సంక్షేమ వెలుగులు

'గడపగడపకు మన ప్రభుత్వం'లో 50వ డివిజన్ ప్రజలు


మహిళతో మాట్లాడుతున్న పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మాలాంటి పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని నగరంలోని 50వ డివిజన్ ప్రజలు పేర్కొన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం ఆ డివిజన్‌లో నిర్వహించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) గడపగడపకు వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. దీనికి మహిళలు స్పందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక తమ కుటుంబానికి పలు పథకాల ద్వారా లబ్ధి చేకూరిందని వివరించారు. ఆయా కుటుంబాలకు అందిన పథకాల వివరాలతో ముద్రించిన బుక్‌లెట్లను పేర్ని కిట్టు వారికి అందజేయగా ప్రభుత్వం ద్వారా తమకు ఇంత పెద్ద మొత్తంలో నగదు అందటం ఆనందంగా ఉందని మహిళలు బదులిచ్చారు. ముఖ్యంగా అమ్మఒడి, చేయూత, చేదోడు, ఆసరా, కాపునేస్తం తదితర పథకాల ద్వారా సొమ్మును నేరుగా తమ ఖాతాలకే జమ చేశారని వివరించారు. సీఎం జగన్ పాలనలో మా కష్టాలు పూర్తిగా తీరుతున్నాయని వారు వివరించారు. ఈ పర్యటనలో పేర్ని కిట్టు వెంట ఆ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ మరీదు నాగరాజు, డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, 1వ డివిజన్ కార్పొరేటర్ జోగి చిరంజీవి, కో–ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, మాజీ కౌన్సిలర్ చిటికిన నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు శేశన నాని, ధనికొండ శ్రీనివాసరావు, బడే భానుతేజ, కారుమూరి శంకర్, శివాజీ పాల్గొన్నారు.

సంగీత సభలను విజయవంతం చేయండి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న విద్యాపీఠం సభ్యులు

మచిలీపట్నంటౌన్: శ్రీ త్యాగరాజ సంగీత విద్యాపీఠం మచిలీపట్నం శాఖ స్వర్ణోత్సవ సంగీత సభలను సంగీతాభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని విద్యాపీఠం కార్యవర్గ సభ్యులు కోరారు. నగరంలోని వివేకానంద మందిరంలో సోమవారం స్వర్ణోత్సవ సంగీత సభలకు సంబంధించిన కరపత్రాలను సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంగీత విద్యాపీఠం ఏర్పాటు చేసి ఈ నెల 22వ తేదీతో 50 సంవత్సరాలు పూర్తవుతుందన్నారు. ఈ సందర్భంగా స్వర్ణోత్సవ కార్యక్రమంలో భాగంగా బుట్టాయిపేటలోని శ్రీ చిట్టిపిళ్లరయ్యస్వామి దేవస్థానం ఆవరణలో ఈ నెల 22 నుంచి 27వ తేదీ వరకు ఆరు రోజుల పాటు సంగీత సభలను నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా ప్రఖ్యాత గాయకులు, వాయిద్య కళాకారులు పాల్గొని ప్రదర్శనలు ఇస్తారని, ప్రముఖ కళాకారులను విద్యాపీఠం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించటం జరుగుతుందన్నారు. పద్మశ్రీ అన్నవరపు రామస్వామి, మోదుమూడి సుధాకర్ లను ఘనంగా సత్కరించనున్నట్లు తెలిపారు. ప్రతిరోజు సంగీత కార్యక్రమాలతో పాటు వాయిద్య కచేరీలు జరుగుతాయన్నారు. సమావేశంలో విద్యాపీఠం అధ్యక్షుడు బీహెచ్‌వీఎల్ రాధాకృష్ణ, ఉపాధ్యక్షుడు సింగరాజు గోవర్ధన్, కార్యదర్శి కల్యాణి, నిర్వాహక కార్యదర్శి కాశీపట్నపు ఉమా, సభ్యులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

జిల్లా ఎస్పీ జాషువ


మహాలక్ష్మికి చెక్కును అందజేస్తున్న ఎస్పీ జాషువ

కోనేరుసెంటర్: పోలీసుశాఖలో విధులు నిర్వర్తిస్తూ అశువులుబాసిన సిబ్బంది కుటుంబాలకు పోలీసుశాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని కృష్ణా జిల్లా ఎస్పీ పి. జాషువ తెలిపారు. పోలీస్ కంట్రోల్ రూంలో ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తూ ఈ ఏడాది జనవరి 4వ తేదీన మరణించిన ఎం. రాంబాబు కుటుంబానికి పోలీసుశాఖ తరఫున మంజూరైన కార్పస్‌ఫండ్ రూ. 1,00,000, విడో ఫండ్ రూ. 50,000 చెక్కులను మృతుని భార్య మహాలక్ష్మికి సోమవారం ఎస్పీ తన కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాంబాబు అకాల మరణం పోలీసుశాఖకు తీరనిలోటన్నారు. బాధిత కుటుంబానికి పోలీసుశాఖ తరఫున ఎప్పుడు ఎలాంటి అవసరం వచ్చినా ధైర్యంగా తమను కలవవచ్చన్నారు. అలాగే బాధిత కుటుంబానికి అందాల్సిన ఇతర ప్రయోజనాలు వీలైనంత త్వరగా అందేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎస్. రామాంజనేయులు పాల్గొన్నారు.

'మన ఊరు మన దేవత' గ్రంథావిష్కరణ


మన ఊరు మన దేవత గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న బుద్ధప్రసాద్, విశ్వానంద స్వామీజీ

అవనిగడ్డ: దివిసీమ చారిత్రాత్మక ప్రసిద్ధి పొందిన ప్రాంతమని, ఈ సీమ ఎన్నో చారిత్రక ఆలయాలకు నెలవని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. స్థానిక గాంధీక్షేత్రంలో తుర్లపాటి రామ్మోహనరావు రచించిన మన ఊరు, మన దేవత గ్రంథాన్ని మాజీ ఉపసభాపతి బుద్ధప్రసాద్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివిసీమలోని ప్రతిగ్రామాన్ని సందర్శించి ఆ గ్రామదేవత చరిత్ర, ఆలయ విశిష్టతను తెలియజేశారన్నారు. ఈ గ్రంథాన్ని పరిశోధక విద్యార్థులు రూపొందించి ఉంటే డాక్టరేట్ పొందేవారని కితాబిచ్చారు. విశ్వానంద స్వామీజీ మాట్లాడుతూ దివిసీమ చారిత్రక, ఆలయ చరిత్రను గొప్పగా అందించిన మన ఊరు, మన దేవత గ్రంథం ప్రతిఒక్కరూ చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత గుడిసేవ విష్ణుప్రసాద్, గ్రామీణ యువజన వికాస సమితి చైర్మన్ మండలి వెంకట్రామ్, లీలా వేణుగోపాలశర్మ, మత్తి శ్రీనివాసరావు, మాదివాడ వెంకట కృష్ణారావు పాల్గొన్నారు.

బస్సులెలా వచ్చేది!




మోపిదేవి: మండల కేంద్రం మోపిదేవిలో బస్టాండ్ ఉన్నా ప్రయాణికులకు ఏమాత్రం ఉపయోగం లేదని గ్రామస్తులు సోమవారం అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానం, ఎంపీడీవో, ఎంఈవో, తహసీల్దార్, వ్యవసాయశాఖ వంటి కార్యాలయాలు, బ్యాంకులకు నిత్యం ప్రజలు వస్తుంటారు. ఇక్కడ బస్టాండ్ ఉన్నా అది ప్రజలకు ఉపయోగపడటం లేదు. షెల్టర్ చుట్టూ నీరు నిలిచిపోతోంది. చిన్న వర్షం పడినా చుట్టూ నీరు నిలిచిపోయి బస్సులు, ప్రయాణికులు వెళ్లడానికి వీలు లేకుండా పోతోంది. అధికారులు సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఉచిత హోమియో వైద్య శిబిరం

చల్లపల్లి: వాసవీ క్లబ్ ఆఫ్ చల్లపల్లి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో నిర్వహించిన ఈ శిబిరంలో హోమియో వైద్యులు డాక్టర్ మణికంఠ 150 మందికి పరీక్షలు చేసి మందులు అందించారు. క్లబ్ అధ్యక్షుడు గోళ్ల ద్రోణ పూర్ణ చంద్రరావు, దింటకుర్తి జ్యోతి, కుసుమ, నేహా శిబిరాన్ని పర్యవేక్షించారు.

కొనసాగుతున్న గ్రామోత్సవం


చిన్నఅమ్మవారు

కోడూరు: కోడూరు ప్రజల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న గంగాభవానీ అమ్మవారి గ్రామోత్సవం భక్తిప్రపత్తులతో కొనసాగుతోంది. సోమవారం కోడూరు తూర్పువైపు, స్వతంత్రపురం, ఎస్సీవాడల్లో చిన్నఅమ్మవారిని ప్రత్యేక వాహనంపై ఊరేగించారు. ప్రతి ఇంటి వద్ద అమ్మవారి వాహనం ముందు నీటిని ఓరబోసి భక్తులు స్వాగతం పలుకుతున్నారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు, చీరలను సమర్పించి తమ భక్తిభావం చాటుతున్నారు. వీవర్స్ కాలనీ, నరసింహపురం, కృష్ణాపురం, ఇస్మాయిల్‌బేగ్‌పేట, యర్రారెడ్డి వారిపాలెం గ్రామాల్లో కూడా అమ్మవారి గ్రామోత్సవం కొనసాగుతుందని ఆలయ ధర్మకర్త కోట యుగంధరరావు తెలిపారు. 23న ప్రధాన గుడిసంబరం నిర్వహించిన అనంతరం 24న చిన్నఅమ్మవారిని ఆలయ ప్రవేశం చేయించనున్నట్లు యుగంధరరావు చెప్పారు.

శ్రీరామ పాదయాత్రకు ఘన స్వాగతం

పామర్రు: భద్రాచలంలో ఈనెల 30వ తేదీన జరిగే శ్రీరామ నవమి కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు పామర్రు మండలం జుఝవరం గ్రామం నుంచి 45 మంది శ్రీరామ పాదయాత్రగా కాలినడకన భద్రాచలంకు సోమవారం బయలు దేరారు. జై శ్రీరామం అంటూ నినాదాలు చేస్తూ గత 15 ఏళ్లుగా ఈ పాదయాత్రను నిర్వహిస్తున్నారు. జుఝవరం గ్రామానికి చెందిన పాదయాత్ర బృందం ప్రతినిధులు కాగిత బ్రహ్మయ్య, గొరిపర్తి రత్తాలు, కొలుసు నారాయణ, ఆకునూరి వీర కుమారి, ఎంపీటీసీ పసుపులేటి నాగ నాంచారమ్మ, బోసిన నాగ శ్రీనివాసరావు, కొండేటి గణపతి, వీరంకి చెన్నకేశవులు పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో పామర్రు మండలం పెదమద్దాలి శివారు కొత్తపెదమద్దాలి గ్రామంలో ఉన్న శ్రీరామాజంనేయస్వామి ఆలయం వద్ద పామర్రు కళా పరిషత్ అధ్యక్షుడు నూతలపాటి త్రివిక్రమరావు సౌజన్యంతో పాదయాత్రలో పాల్గొన్న వారికి స్వాగతం పలికి ఆతిథ్యం ఇచ్చారు. ఆలయ అర్చకులు రొంపిచర్ల కోదండపాణి భార్గవ అప్పలాచార్యులు పాదయాత్ర చేసే భక్తులను ఆశీర్వదించారు. కార్యక్రమం కళా పరిషత్ అధ్యక్షుడు ఎస్.త్రివిక్రమరావు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలను సత్వరమే పరిష్కరిస్తాం

పామర్రు(పమిడిముక్కల): తన వద్దకు వచ్చిన రైతుల సమస్యలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర వ్యవసాయ మిషన్ ఉపాధ్యక్షులు ఎంవీఎస్ నాగిరెడ్డి తెలిపారు. పమిడిముక్కల మండలం కూడేరు గ్రామంలో ఓ కార్యక్రమానికి సోమవారం ఆయన హాజరయ్యారు. ఈ నేపథ్యంలో స్థానిక రైతులు సమస్యలపై నాగిరెడ్డికి అర్జీని అందజేశారు. రైతులు మాట్లాడుతూ.. ఇప్పటికే ఆర్బీకేల ద్వారా విక్రయించిన ధాన్యం నగదు జమ కాలేదన్నారు. సమస్యను పరిష్కరించాలని కోరుతూ అర్జీని సమర్పించారు. నాగిరెడ్డి మాట్లాడుతూ.. రైతులకు న్యాయం జరిగే విధంగా తగు విధమైన చర్యలు తీసుకుంటానని రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామంలోని రైతులు పాల్గొన్నారు.

ఆహారంలో చిరుధాన్యాలను తీసుకోవాలి


కోటిరెడ్డిపేటలో అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ భానుశ్రీ

పామర్రు: చిరు ధాన్యాల ప్రాధాన్యతను తెలుసుకుని ప్రతి ఒక్కరూ ఆహారంలో చిరుధాన్యాలను తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ వి.భానుశ్రీ తెలిపారు. స్థానిక కోటిరెడ్డిపేటలో అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణ్ పక్వాడాపై అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భానుశ్రీ మాట్లాడుతూ.. మార్చి 20 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. శరీర ధృడత్వానికి చిరుధాన్యాలు ఎంతో ఉపయోగకరమని చెప్పారు. లైట్ ద ల్యాంప్ వెలిగించి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎస్.విజయకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

సంపద కేంద్రాన్ని సమర్థంగా నిర్వహించాలి

డీపీఓ నాగేశ్వర నాయక్


పునాదిపాడులో సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీపీఓ నాగేశ్వరనాయక్

కంకిపాడు: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సమర్థంగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వర నాయక్ ఆదేశించారు. మండలంలోని పునాదిపాడులో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆయన సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వర్మీకం పోస్టు తయారీ, పిట్స్, వ్యర్థాలను వేసే పిట్‌లను నిర్వహించే తీరును పరిశీలించారు. పిట్స్ (కుండీ)లో చెట్ల ఆకులు వేయటం వల్ల ఉపయోగం తక్కువగా ఉంటుందని, త్వరగా కుళ్లిపోయే వాటిని మాత్రమే పిట్స్‌లో వేసుకోవాలని డీపీఓ సూచించారు. కంపోస్టును తయారు చేసి విక్రయించాలన్నారు. తడి చెత్త, పొడి చెత్త సేకరణ బాధ్యతతో చేపట్టాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో శిక్షణ కేంద్రాల్లో ఒకటిగా ఉన్న పునాదిపాడు సంపద కేంద్రాన్ని సమర్థంగా నిర్వహించాలని, ఇతర ప్రాంతాల నుంచి శిక్షణకు వచ్చే ప్రజాప్రతినిధులు, అధికారులకు స్ఫూర్తిదాయకంగా నిలవాలని కోరారు. తనిఖీలో ఈఓ బి.వెంకటేశ్వరరావు, మునిరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సాయి మందిర వార్షికోత్సవం


సాయినాథునికి అభిషేకాలు నిర్వహిస్తున్న భక్తులు

తోట్లవల్లూరు: తోట్లవల్లూరులోని శ్రీవిజయదత్త షిరిడీ సాయినాథుని మందిర 12వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు తుర్లపాటి వెంకట ప్రభాకర్ ఆధ్వర్యంలో సాయిబాబాకు పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకుని పూజలు జరపటంతో పాటు భజనలు నిర్వహించారు. పూజల అనంతరం అన్నసమారాధన జరిగింది. ఆయా కార్యక్రమాలను ఆలయ కమిటీ ప్రతినిధులు పర్యవేక్షించారు.

మల్లేశ్వరస్వామి ఆలయంలో అన్నసమారాధన

మండవల్లి: మండవల్లిలో కొలువై ఉన్న శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో 41వ వార్షిక కల్యాణ మహోత్సవాలు ముగిసిన సందర్భంగా సోమవారం రాత్రి భారీ అన్నసమారాధన జరిగింది. అన్నసమారాధనలో మండవల్లి సమీప గ్రామాల నుంచి 2,500 మంది పాల్గొన్నారు. ఉదయం నుంచి గ్రామోత్సవం, రాత్రి పల్లకీ ఉత్సవం నిర్వహించారు. గూడూరు హనుమ శ్శాస్త్రి, భవాని శంకర్ అర్చకులుగా వ్యవహరించారు. ధర్మకర్తల మండలి చైర్మన్ కొల్లా కృష్ణ, కార్యనిర్వాహణాధికారి శింగనపల్లి శ్రీనివాసరావు భక్తులకు తగిన ఏర్పాట్లు చేశారు.